# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 09-05-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **భారత్ -పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్తతల దృష్ట్యా రక్షణమంత్రి రాజ్ నాథ్ సింగ్ ఈరోజు త్రివిధ దళాధిపతులతో సమావేశమయ్యారు.**

**2.** **రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఈరోజు మాక్ డ్రిల్‌తో పాటు విస్తృత తనీఖలను అధికారులు నిర్వహిస్తున్నారు.**

**3.** **ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు అనంతపురం జిల్లాలోని హంద్రీనీవా ప్రాజెక్టును పరిశీలిస్తారు.**

**4** **జూన్ నెల చివరి నాటికి టిడ్కొ గృహనిర్మాణాలను పూర్తిచేయాలని గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అధికారులను ఆదేశించారు.**

**5.** **గురుకులాలు, సంక్షేమ వసతి గృహాల్లో 100 శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా సిబ్బంది పనిచేయాలని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు.**

==========================

భారత సరిహద్దు రాష్ట్రాలైన జమ్మూకశ్మీర్, రాజస్థాన్, పంజాబ్, హర్యానా సరిహద్దుల్లో పాకిస్థాన్ దాడులు చేసింది. యుద్ధవిమానాలు, క్షిపణులు, ఆత్మాహుతి డ్రోన్లతో పాక్ దాడులకు దిగడంతో భారత రక్షణ వ్యవస్థ ఆ దాడులను సమర్థ వంతంగా తిప్పికొట్టింది. జమ్మూ కాశ్మీర్లోని సత్వారీ, సాంబా, ఆర్ఎస్ పురా, అర్నియాలపై దాడి చేసింది. అన్ని క్షిపణులను భారత వైమానిక రక్షణ దళాలు అడ్డుకున్నాయని రక్షణ వర్గాలు తెలిపాయి. ఈ ఉద్రిక్తతల నేపథ్యంలో సరిహద్దు రాష్ట్రాలైన పంజాబ్, గుజరాత్ జమ్మూకశ్మీర్ , రాజస్థాన్ లో కేంద్ర ప్రభుత్వం హై అలెర్ట్ ప్రకటించింది. హర్యానా, ఢిల్లీల్లోనూ భద్రతను కట్టుదిట్టం చేసింది. పోలీసులు, పాలనాధికారుల సెలవుల రద్దు చేసింది. రాజస్థాన్ లోని జోధ్ పుర్, బీకానేర్, కిషన్ ఘర్ విమానాశ్రయాలను మూసివేసింది.

---------------------------

మరోవైపు.. పాకిస్థాన్ పై భారత్ ప్రతిదాడుల దృష్ట్యా ఢిల్లీలో రక్షణ మంత్రిత్వ శాఖ కార్యాలయంలో త్రివిధ దళాధిపతులతో రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ సమావేశమయ్యారు. మంత్రి ఈ రోజు సమీక్ష సమావేశాన్ని నిర్వహిస్తున్నారు.

ఇదిలా ఉండగా భారత రక్షణ వ్యవస్థ పాకిస్థాన్ దాడులను సమర్థ వంతంగా తిప్పికొట్టడంతో పాకిస్తాన్ డిజిటల్ మాధ్యమాలలో నకిలీ వార్తలను ప్రచారం చేస్తోంది. అవన్నీ ఉద్దేశపూర్వకంగా పాకిస్తాన్ ప్రచారం

చేస్తోందని లెఫ్టినెంట్ రాజీవ్ చోప్రా తెలియజేస్తూ,

వాయిస్...30 సెకన్లు

భారత్–పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్తతల నేపథ్యలో ఇండియన్ ప్రీమియర్ లీగ్ 18వ సీజన్‌ను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు బీసీసీఐ ఒక ప్రకటనలో తెలిపింది.

---------------------------

జమ్మూకాశ్మీర్‌లో జరిగిన కాల్పుల్లో రాష్ట్రానికి చెందిన వీర జవాను ఎమ్.మురళీ నాయక్ అమరులయ్యారు. శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కల్లి తండాకు చెందిన జవాన్ భారత్ సైన్యంలో పనిచేస్తున్నారు. ఆయన మృతి పట్ల రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంతాపం వ్యక్తం చేశారు.

---------------------------

భారత్–పాక్ సరిహద్దుల్లో ఉద్రిక్తతల దృష్ట్యా తిరుమలలో భద్రతను పెంచినట్లు అధికారులు తెలిపారు. తిరుపతిజిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు జిల్లా అధికారులతో తిరుమల సీవీఎస్‌వో కార్యాలయంలో ఈరోజు సమావేశమయ్యారు. తిరుమలలో భద్రతా బలగాలు తనిఖీలపై ఎస్పీ సమీక్ష నిర్వహించారు.

అదేవిధంగా రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో మాక్ డ్రిళ్ళను నిర్వహిస్తున్నారు. ఎన్టీఆర్, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, అనకాపల్లి జిల్లాల్లో పోలీసు అధికారులు విస్తృత తనీఖీలు చేపడుతున్నారు. బస్టాండ్, రైల్వే స్టేషన్లు సహా రద్దీగా ఉండే ప్రాంతాలల్లో తనీఖీలు నిర్వహిస్తున్నారు. ఇందులోభాగంగా ఏలూరులో నిర్వహించిన తనిఖీల్లో ఏలూరు జిల్లా ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ పాల్గొని మాట్లాడుతూ..

..వాయిస్.. 26 సెకన్లు

---------------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు అనంతపురం జిల్లాలో పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా ఒరవకొండ మండలంలోని హంద్రీనీవా సుజలస్రవంతి ప్రాజెక్టును ముఖ్యమంత్రి పరిశీలిస్తారు. అలాగే ఛాయాపురంలో ఎన్.ఎస్.ఎస్. కాలువ పనులను పరిశీలించి, అధికారులను వివరాలు అడిగి తెలుసుకుంటారు. అనంతరం ప్రజావేదిక సభలో ముఖ్యమంత్రి పాల్గొని, ప్రసంగిస్తారని అధికారులు తెలిపారు.

---------------------------

జూన్ నెల చివరి నాటికి టిడ్కో గృహనిర్మాణాలను పూర్తి చేయాలని గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అధికారులను ఆదేశించారు. ఏలూరు జిల్లా నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో నూజివీడు నియోజకవర్గంలో గృహ నిర్మాణ ప్రగతిపై మంత్రి ఈ రోజు సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, జిల్లాలో చేపడుతున్న గృహనిర్మాణాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

---------------------------

గురుకులాలు, సంక్షేమ వసతి గృహాల్లో 100 శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా సిబ్బంది పనిచేయాలని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. అమరావతిలోని ఒక ప్రయివేట్ విశ్వవిద్యాలయంలో గురుకులాల జిల్లా కన్వీనర్ అధికారులు– డీసీవోలు, ప్రధానోపాధ్యాయులకు గురు మిత్ర ఏఐ యాప్, విద్యార్థులకు విద్య ఆరోగ్యం, సంరక్షణపై కార్యశాలను నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, సాంఘిక సంక్షేమ శాఖలో అనేక మార్పులకు శ్రీకారం చుట్టామని తెలిపారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు పురస్కారాలు అందజేసి వారిని మరింత ప్రోత్సహిస్తున్నామని మంత్రి వివరించారు.

---------------------------

ఆపరేషన్ సిందూర్‌లో భారత సైన్యానికి ప్రజల మద్దతు ఉంటుందని శాసనమండలి సభ్యులు సోము వీర్రాజు తెలిపారు. తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారిని ఆయన ఈరోజు దర్శించుకున్నారు. అనంతరం సోము వీర్రాజు పాత్రికేయులతో మాట్లాడుతూ, సైనికులకు ఉత్సాహం, శక్తిని ఇవ్వాలని స్వామి వారిని కోరుకున్నట్లు చెప్పారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే వారిపైనే భారత్ చర్యలు తీసుకుంటుందని ఆయన తెలియజేస్తూ,

వాయిస్..30 సెకన్లు

---------------------------

ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధులు, సామాజికవేత్త, భారత జాతీయ కాంగ్రెస్ సీనియర్ నాయకులు గోపాలకృష్ణ గోఖలే జయంతిని ఈరోజు జరుపుకుంటున్నాం. 1866 మే 9వ తేదీన మహారాష్ట్రలోని రత్నగిరి జిల్లా కోట్లక్‌లో జన్మించిన గోపాలకృష్ణ గోఖలే... 1889లో భారత జాతీయ కాంగ్రెస్‌లో ప్రవేశించారు. అతి తక్కువ కాలంలోనే 1905లో మితవాదుల ప్రాబల్యం వహించిన భారత జాతీయ కాంగ్రెస్‌లో ప్రముఖ పాత్ర వహించారు. 1905లో సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సొసైటీని ఏర్పాటు చేశారు. 1902 నుండి 1915 వరకు భారత శాసనమండలి సభ్యులుగా కొనసాగిన గోఖలే... 1915 ఫిబ్రవరి 19వ తేదీన ముంబైలో కన్నుమూశారు.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎల్. నారాయణ కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్.... 29 సెకన్లు...

---------------------------

ప్రయాణికుల రద్దీ దృష్ట్యా చర్లపల్లి శ్రీకాకుళం రోడ్ స్టేషన్ల మధ్య 26 ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. చర్లపల్లి–శ్రీకాకుళం రోడ్ రైలు ఈ నెల 12 నుండి –జూన్ 24 వరకు ప్రతి సోమ, మంగళవారాల్లో నడుస్తుందని, అలాగే శ్రీకాకుళం రోడ్–చర్లపల్లి మధ్య ఈ నెల 12 – నుండి జూన్ 25 వరకు ప్రతి సోమ, బుధవారాలలో ప్రయాణికులకు ప్రత్యేక రైలు అందుబాటులో ఉంటుందని వెల్లడించింది. ఈ రైళ్లు నల్గొండ, మిర్యాలగూడ, గుంటూరు, విజయవాడ, రాజమహేంద్రవరం, దువ్వాడ, విజయనగరం మార్గంలో రాకపోకలు సాగిస్తాయని పేర్కొంది.

---------------------------

రాష్ట్రంలో పదవ తరగతి మార్కుల మెమోలను పాఠశాల విద్యాశాఖ వెబ్ సైట్‌లో అందుబాటులో ఉంచినట్టు పరీక్షల విభాగం సంచాలకులు కేవీ శ్రీనివాసులురెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వారి లాగిన్ ద్వారా షార్ట్ మెమోలను డౌన్ లోడ్ చేసి విద్యార్థులకు అందించాలని సూచించారు. మార్కుల జాబితాల్లో ఏమైనా పొరపాట్లు గుర్తిస్తే పరీక్షల విభాగానికి తెలియజేయాలని ఆయన సూచించారు.

=======================